# పరోక్షము - సమక్షము

వేణీరావు, హనుమాయమ్మ, నేను ఎట్లాగో అవస్థపడి కలకత్తా మెయిలు అందుకున్నాము. టికెట్లు ఎంత ముందుగా తెప్పించుకొన్నా - మేము బయలుదేరిన సమయాన్నిబట్టి రైలు అందుతుందని అనుకో లేదు. రాత్రిపూట చిన్న చిన్న స్టేషనులలో పెద్ద తరగతుల పెట్టెల తలుపులను తెరపించేలోపల రైలు కదులుతూ ఉంటుంది. గార్డుచేసిన హంగామాతో మేము ఎట్లాగో ఎక్కటము జరిగింది. రిజర్వు చేసుకోలేక పోయినా ప్రయాణీకులు హాయిగా కాళ్లుచాపుకొని నిద్ర పోతున్నారు. చొరవ చేసుకోలేని మేము ముగ్గురము మా పెట్టెమీద కూర్చున్నాము. ప్రయాణీకుల సౌకర్యార్థము కాబోలు దీపము ఆర్పివేయబడ్డది.

ఒకస్టేషను దాటిన తరువాత-వేణీరావు నా చేతిమీదతట్టి "ఆ మూలగా-పైబర్తుమీది నుంచి వినబడుతున్న మాటలను ఆలకించు"అన్నది.

"ఈ రోజుల్లో సంఘసేవ చేయని ఆడవాళ్ళు ఉన్నారంటారా? చేతిసంచులతో ఎక్కడ చూసినా వాళ్లేనంటే నమ్ముతారో-లేదో!"

ఆ కంఠస్వరము ఆగకముందే రెండు మూడు గొంతులు పెద్దగా నవ్వాయి.

"వాళ్ల శోకులనుగురించి చెప్పాలంటే ఎన్ని రోజులయినా చాలవనుకోండి. మనము ఎంత తలతంచుకొన్నా - వాళ్ళే పలకరించి మాట కలుపుతారు. నాకు వాళ్ల మొగుళ్లను తలుచుకుంటే విపరీతమైన జాలి కలుగుతూ ఉంటుంది."

విన్న వాళ్ళంతా తన ధోరణికి మెచ్చి అభినందన పూర్వకముగా నవ్వుతారని కాబోలు కాసేపు ఆగినట్లున్నాడు.

"మీకు అనుభవము ఉన్నదో లేదో-నలుగురు ఆడవాళ్ళు ఉంటారా-ఒకరితో మాట్లాడుతూ ఉంటే మరొకరికి కోపము. విధీ విసుగు లేకుండా పొగుడుతూ ఉంటేనే వాళ్ళు మనుష్యులనుకోండి."

అతడికి ప్రోత్సాహకరముగా ఈ సారి నవ్వులు బాగా వినిపించాయి.

"ఏమిటో-పిల్లల తండ్రులను చూస్తే నాకు విపరీతమైన జాలి. ఎందుకో! మీకో తమాషా సంగతి చెప్తాను వినండి. ఈ రోజుల్లో మనమడిని ఎత్తుకుంటూ కూడా ఆడవాళ్ళు పౌడరు పూసుకుంటున్నారు. ఈ సంగతి తెలుసునా?"

ఈ సారి సుమారు పదిగొంతులు కలిసి నవ్వినట్లే నవ్వాయి. అప్పుడు వేణీరావు ముఖము వెలుతురులో చూడగలిగితే ఎంత ఎర్రబడ్డదో తెలిసేది. మా హనుమాయమ్మకు నిద్రే సరిపోయింది.

తరువాత మాకు మాటలు సరిగా వినబడలేదు కాని, అప్పుడప్పుడు నవ్వులు మాత్రము వినబడుతూ వచ్చాయి. తెల్లవార వచ్చింది. మెయిలు వేగము రాత్రికంటె కాస్త తగ్గి నట్లనిపించింది. రైలు ఆగగానే మేము పెట్టెను కాస్త ప్రక్కకు జరిపి కూర్చున్నాము.

అయిదారుగురు గబగబా తోసుకుంటూ లోపలికి వచ్చారు. మాకు వెనుకగా ఉన్న బర్తుదగ్గరగా నిలబడి "ఆయన ఇంకా లేవనట్లున్నారు. కాసేపు నిలబడదామా పోనీ-" అనుకుంటున్నారు. ఈ సందడికి ఆయన లేవనే లేచాడు. ఎన్ని రకముల అభినందనాలో-ఎన్ని పూలహారాలో లెక్కలేదు. వాళ్ళ ఆనందోత్సాహాలతో ఆయనకు ఊపిరి సలుపలేదు. అయినా చిరునవ్వుతో అన్నీ స్వీకరిస్తున్నాడు. వాళ్ళు వ్రెస్సరు కాఫీ బిస్కట్లు యిచ్చారు. ఆ స్టేషనులో దొరకే పత్రికలన్నీ ఆయనకు కొని యిచ్చారు. ఆయన "వద్దు! నాకెందుకు ఇవన్నీ!" అంటూనే రైలుదిగి-ప్లాటుఫారముమీద నిలబడి వాళ్ళు ఫోటో తీస్తామనగానే పూల హారాలు జరీకండువా సర్దుకొన్నాడు!

ఇంత హడావడి ఏమిటా అని కనుక్కుంటే ఆయనట-ఒక సినెమా నటుడట!

ఏలూరు స్టేషను వచ్చేసరికి బండి లేటు అయిందేమో ఎనిదిమిన్నర కావచ్చింది.

అప్పటికి ప్రయాణికులు చాలావరకు దిగిపోయారు. పై బర్తులమీద ఉన్నవారందరూ క్రిందికి దిగారు.

మేము మాటల సందడిలో రైలు నాలుగు స్టేషనులు దాటటము గమనించనేలేదు.

అంతలో ఒక యువకుడు కూర్చున్న స్థలములోనుంచి లేచివచ్చి, మాకెదురుగా కూర్చొని, ఇంగ్లీషు/డైజెస్టు చదవటము మొదలు పెట్టాడు. కొంతసేపటికిగాని అతడు సరిగా చదవటము లేదని మేము కనుక్కో లేకపోయాము. మాలోకి కాస్త చూడ టానికి బాగుండేది హనుమాయమ్మ. నాలుగేళ్ళు పెద్దదయినా షాపులముందర నిలబెట్టబడిన బొమ్మలా అలంకరించుకొనేది వేణీరావు.

"నమస్కారమండీ" అన్నా డా యువకుడు మావైపు తిరిగి నేను ఆ నమస్కారము 'ఎవరికా' అనుకున్నాను. హనుమాయమ్మ తనకేమోనని సందేహమైనా పడదు. వేణీరావు అందుకున్నది.

"సమితికి చాలామంది సభ్యులున్నారా ? మీరు ఆర్గనైజరులా?" అడిగాడు కుతూహలముతో.

అతడు దేనినిగురించి అడుగుతున్నాడో తెలియక నేనూ హనుమాయమ్మా తెల్లబోయాము. వేణీరావు జవా బిచ్చింది. "వెయ్యిమందివరకు సభ్యు లున్నారు. వీళ్ళిద్దరు కార్యనిర్వాహక వర్గ సభ్యురాండ్రు. నేను కార్యదర్శినిని."

అతడు అందుకు తన సంతోషాన్ని తెలుపుతూ ఆ సమితిరిపోర్టు, నియమావళి ఇమ్మని అడిగాడు. ప్రస్తుతము అవి తనదగ్గర లేవని చెప్పుతూ-అనాథ శరణాలయము, హిందీ

క్లాసులు, వయోజన పాఠశాల, చేతిపనులు, బాలెంతల వైద్యశాల ఏకధాటీగా నడుపబడుతున్నాయని వేణీరావు అనర్గళముగా చెప్పేసింది. అతడు వాటివివరాలను ఫొటోలను యిమ్మంటున్నాడు. ఆమె పెళ్లి పంపుతానన్నది. తన చిరునామా తెలపటానికి అతడు ఒకకార్డు ఇచ్చాడు. ప్రసన్న వదనముతో వేణీరావు అందుకొని తన సంచీలో పెట్టుకొన్నది.

"ఇప్పుడు స్త్రీలల్లో కూడా త్యాగమూర్తులు ఉద్భవిస్తున్నారు. సమాజ సేవకురాండ్రంటే నా కెంతో గౌరవము. మీకు ఎంతసామర్థ్యము లేకపోతే మీ యిళ్లతోపాటు సంఘాన్ని దిద్దగలుగుతారు! ఒక్కొక్క ఊళ్ళో ఎంత సోషల్ సర్వీసు చేస్తున్నారంటారు స్త్రీలు? ప్రతిశాఖ యంత్రములా నడుపబడుతున్నది. నా విచారమంతా ఒక్క దానికే-ఏమిటంటే - మన సంఘము ఉన్నదే-అది స్త్రీమూర్తి విలువలను ఇంకా గ్రహించలేకపోతున్నది. మిమ్మల్ని కలుసుకునే భాగ్యము నాకు కలిగినందుకు చాలా సంతోషము. నమస్కారము. వెళ్ళివస్తాను" అంటూ అతడు రైలుదిగి వెళ్ళిపోయాడు.

రైలు కదిలేవరకూ నిగ్రహించుకొని-ఈ నాటకమంతా ఏమిటంటే-వేణీరావు తన పెట్టెకు అంటించిన "మహిళాసమితి" అనే కాగితము చూపించింది. అప్పటికీ నాకు అర్థము కాకపోయింది.

"ఈ కార్డు చూడు. అత డొక పత్రికా విలేఖరట!" అంటూ ఒక కార్డు నా చేతికిచ్చింది. "రాత్రంతా మాట్లాడిన ఆ గొంతు విన్నావుకదా, ఆ మాత్రము కంఠస్వరము గుర్తించలేవూ?" అన్నది వేణీరావు నా ముఖము చూస్తూ. నేను తెల్లబోయాను.

ఆమె వాక్యము పూర్తిచేయక ముందే మేము దిగివలసిన స్టేషను వచ్చింది. దిగిన తరువాత నేను అతడిని గురించే ఆలోచిస్తున్నాను-'ఆ నటుడికి సన్మానము చేసిన వాళ్ళలో ఈ విలేఖరి కూడా ఉన్నాడా-లేక గుంపులో ఎక్కడైనా ఉన్నాడా? విలేఖరి కనుక తప్పకుండా ఎక్కడో ఉండే ఉంటాడు' అని సమాధానపడ్డాను. అంతలో వేణీరావు కూలివాడితో పెట్టెను తీసుకొని రమ్మని చెప్పుతూ "అత డెంత పత్రికా విలేఖరో నేనంత సంఘ సేవకు రాలిని!" అని పెట్టెకు అంటించిన చీటీ కాస్తా లాగి పారేసింది.